క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం వితరణ



యూనిఫామ్ పంపిణీ చేస్తున్న కమిషనర్ తదితరులు

నాయుడుపేటటౌన్: నాయుడుపేట మున్సిపాలిటీ కార్మికులకు నందా ప్రకాశం కుటుంబ సభ్యులు యూనిఫాం వితరణ చేశారు. నందా జగదీష్ కుమార్ వర్ధంతి పురస్కరించుకుని గురువారం స్థానికంగా ఒక ఫంక్షన్‌లో హాల్‌లో విశ్రాంత ఉద్యోగులు సంఘ, రోటరి క్లబ్ నాయకుల సారథ్యంలో మొత్తం 207 మంది వివిధ విభాగాల కార్మికులకు యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా నందా కుటుంబ సభ్యులైన ఎస్‌ఆర్‌లు విజయప్రభ, శ్రీనివాసులు రెడ్డి దంపతులు, సీహెచ్ సీతామహాలక్ష్మి, విశ్రాంత ఉద్యోగులు సంఘం అధ్యక్షులు పీడీ ఉదయ శంకర్, రోటరి క్లబ్ అధ్యక్షులు ఆదవరం నాగూరయ్య, మునగాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఓజిలి: స్థానిక తహసీల్దార్, ఎంఈఓ కార్యాలయాల్లో జాతీయ నులిపురుగుల దినోత్సవం పోస్టర్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డానియల్‌రాజు గురువారం ఆవిష్కరించారు. ఎంఈఓ శైలజ, సీహెచ్‌ఓ సుబ్బరామయ్య, టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఠాగూర్‌కు ఘన నివాళి

రాపూరు: రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి పురస్కరించుకుని గురువారం స్థానిక గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి అంజయ్య పూలమాలవేసి, నివాళులర్పించారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. పలువురు పాఠకులు పాల్గొన్నారు.

దాడి: నలుగురిపై కేసు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని సీఎస్ తేజ సెంటర్ సమీపంలో ఓ చికెన్ షాపులో పనిచేస్తున్న తుమ్మూరు సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన టీ.వెంకటేశ్వర్లు , చిన్న రమేష్‌పై విచక్షణా రహితంగా దాడి చేసిన నలుగురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వరదయ్యపాళెం గ్రామానికి చెందిన వంశీకృష్ణ, చైతన్య, పార్థసారథి, ఫిలిప్ ఈనెల 2న రాత్రి నాయుడుపేటకు వచ్చారు. చికెన్ షాపు వద్ద ఉన్న వెంకటేశ్వర్లు, రమేష్‌లతో చిన్నపాటి విషయమై వివాదానికి దిగారు. ఇద్దరిపై ఆ నలుగురు పైపులతో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఓజిలి: మండలంలో సగుటూరులోని శ్రీ బాలా అమృత మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం గణపతి, గో పూజ, హోమాలు చేశారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఆలయ చైర్మన్ లెక్కల మల్లికార్జున నాయుడు తెలిపారు.

స్కూలు తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

దక్కిలి: ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు మధ్యాహ్నం రుచికరంగా భోజనం పెట్టాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ వహించాలన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా జయంపు దళితవాడ ప్రాథమిక పాఠశాలలో చిన్న అంకయ్య అనే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ఉపాధ్యాయుడు ప్రతి రోజు మద్యం తాగి పాఠశాలకు వచ్చి 4, 5వ తరగతి చదువుతున్న విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులపై బాలాయపల్లి మండల విద్యా శాఖాధికారి ప్రాథమిక విచారణ నివేదికల ఆధారంగా అతడిని విధుల నుంచి సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

నడిగుర్తిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



నోటి క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వాకాడు: మండలంలోని నిడిగుర్తిలో గురువారం తిరుపతి స్విమ్స్ అధికారుల బృందం ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరం నిర్వహించింది. తొలుత క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు వ్యాధి నివారణ చర్యలను వైద్యులు చిత్రపటాలతో అవగాహన కల్పించారు. పింక్ బస్సుల్లో నోటి, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకు పాప్ స్మియర్ పరీక్షలు చేశారు. స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజు, నోడల్ ఆఫీసర్లు ప్రత్యూష, ఎం.లలిత, నిడిగుర్తి వైద్యులు హేమ, స్రవంతి, స్విమ్స్ మెడికలాఫీసర్ హరిత, సర్పంచ్ నాగరాజు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

116మందికి ఇద్దరే టీచర్లు..!

పెళ్లకూరులోని ఉన్నత పాఠశాలలో టీచర్ల కొరత వేధిస్తోంది. కేవలం మ్యాథ్స్, సోషల్ తప్పితే తక్కిన సబ్జెక్ట్ టీచర్లు ఎవరూ లేకపోవడంతో విద్యార్థుల భవితపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. టీచర్లను నియమించండి మహాప్రభో అని తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు.

- ఐదుగురు టీచర్లలో హెచ్‌ఎం సహా ఇద్దరు ఎంఈఓలుగా బదిలీ
- ఇంగ్లిష్, తెలుగు, హిందీ, ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టుల బోధనకు టీచర్లు కరువు
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తలిదండ్రులు



పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

పెళ్లకూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 116మంది విద్యార్థులు ఉన్నారు. 10వ తరగతిలో 23మంది ఉన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఇక్కడి ప్రధానోపాధ్యాయుడు టీ.రవీంద్రబాబును గూడూరు ఎంఈఓగా, బయాలజీ టీచర్ వెంకటేశ్వర్లును పెళ్లకూరు ఎంఈఓగా, తెలుగు టీచర్ జీ.శిరీషను కోట ఎంఈఓగా ఉన్నతాధికారులు నియమించారు. ఒకే స్కూల్ నుంచి ఇలా ముగ్గురు ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లను వివిధ ప్రాంతాలకు ఎంఈఓలుగా వెళ్లడంతో ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యాబోధనపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఒక తరగతికి రోజూ 8 పీరియడ్ల చొప్పున 6 నుంచి 10వ తరగతి వరకు రోజూ 40 పీరియడ్లు టైం టేబుల్ ఉంది. కేవలం మ్యాథ్స్, సోషల్ టీచర్లతోనే స్కూలు అతికష్టం మీద నడుస్తోంది. మిగిలిన ఇంగ్లిష్, తెలుగు, హిందీ, ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టులకు టీచర్లు లేకపోవడంతో రోజూ ఎన్ని పీరియడ్లు అటకెక్కుతున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. తక్కిన ఇద్దరు టీచర్లు కూడా నిస్సహాయులవుతున్న పరిస్థితి. విద్యార్థులకు పాఠాలు చెప్పేమాటెలా ఉన్నా టీచర్లు లేకపోవడంతో వారిని కంట్రోల్ చేయడానికే సరిపోతోంది. పైగా వ్యాయామోపాధ్యాయుడు కూడా లేకపాయె. అటు చదువులు, ఇటు ఆటలు దేనికీ నోచుకోక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి టీచర్లను నియమించాలని కోరుతున్నారు.

కొత్త డీఎస్సీతో సర్దుబాటు

పెళ్లకూరు హైస్కూల్లో టీచర్ల కొరత విషయమై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. ఇటీవల జరిగిన కొత్త డీఎస్సీలో ఎంపికైన వారితో సర్దుబాటు చేస్తామని జిల్లా ఉన్నతాధికారులు చెప్పారు.

–వెంకటేశ్వర్లు ఎంఈఓ, పెళ్లకూరు

కూటమి అక్రమ దందాలకు అడ్డుకట్ట వేయరా..?

- సూళ్లూరుపేట ఆర్డీఓను నిలదీసిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ దందాలపై ఆర్డీఓను ప్రశ్నిస్తున్న కిలివేటి సంజీవయ్య తదితరులు

సూళ్లూరుపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూళ్లూరుపేట నియోజకవర్గంలో కూటమి బడా నాయకులు ఇసుక, గ్రావెల్‌ను లేఔట్లకు, పొరుగు రాష్ట్రాలకు పట్టపగలే దర్జాగా తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఔచిత్యమేమిటని సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య నిలదీశారు. గురువారం ఆయన నియోజకవర్గ నాయకులతో ఆర్డీఓను కలిసి పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మట్టి మాఫియాను ఇసుక, మట్టి, సిలికా ఇసుక తరలిస్తుంటే కట్టడి చేయాల్సిన రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ రవాణా, దందాలపై అధికారులకు ఫోన్ చేసిన చెప్పినపూ అలసత్వం వహిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీకి చెందిన రేషన్ డీలర్లను బలవంతంగా రాజీనామాలు చేయించి కూటమి మద్దతుదారులకు రేషన్ దుకాణాలు కేటాయిస్తోందని నిరసన వ్యక్తం చేశారు. కూటమి నేతలు రేషన్ సరుకులను పక్కదారి పట్టిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సూటిగా ప్రశ్నించారు. కూటమి నేతల అక్రమ దందాలపై చర్యలు తీసుకోకపోతే ఆర్డీఓ కార్యాలయం ముందు నిరాహారదీక్ష చేయడానికైనా వెనుకాడబోమని సంజీవయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట నాయకులు ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, చిన్ని సత్యనారాయణ, నాయుడుపేట నాయకులు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, కురుగొండ్ల ధనలక్ష్మి, కలికి మాధవరెడ్డి, వట్టూరు కిషోర్, ఓజిలి నాయకులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, తడ నాయకులు కే ఆర్ముగం, కే.మరుగన్, ఆర్‌కే సుందర్‌రెడ్డి, తడ రాజ్‌కుమార్, దొరవారిసత్రం నాయకులు ఏకొల్లు మునస్వామినాయుడు, నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

లేగదూడలకు అందాల పోటీలు



లేగదూడల అందాల పోటీల్లో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రాపూరు: పశువులకు కృత్రిమ గర్భధారణతో పాడి రైతులకు ఎంతో మేలు కలుగుతుందని జిల్లా పశు గణాభివృద్ధి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. కృత్రిమ గర్భధారణతో జన్మించిన లేగ దూడలకు గురువారం సంక్రాంతిపల్లె పశు వైద్యశాల్లో అందాల పోటీలు నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహించాయి. ఆరోగ్యకరమైన దూడల్లో తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన దూడలకు సంబంధించి వాటి యజమానులు మన్నెం పెంచల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమణమ్మకు సర్టిఫికెట్, బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ సైతం ప్రోత్సాహక బహుమతులు అందజేసి శ్రీనివాసరావు మాట్లాడారు. పాడిరైతులకు సబ్సిడీపై రూ.150లకు ఇచ్చే ఇంజెక్షన్ పశువులకు వేస్తే వాటికి లేగ దూడలు మాత్రమే పుడతాయని, దీంతో పాల ఉత్పత్తితో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీ అనిల్‌కుమార్, పశువైద్యులు ప్రసాద్, సుప్రజ, రాజేష్, సొసైటీ మాజీ అధ్యక్షుడు చెన్ను భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉల్లాస్-అక్షర ఆంధ్రపై శిక్షణ



మాట్లాడుతున్న అధికారులు

దొరవారిసత్రం: పొదుపు గ్రూపుల్లోని నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్-అక్షర ఆంధ్ర కార్యక్రమంపై శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక ఎంపీడీఓ గోవర్ధన అన్నారు. గురువారం వివిధ శాఖల అధికారులకు సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని పొదుపు గ్రూపుల్లో 2,390 మందిని నిరక్షరాస్యులుగా ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరందరినీ అక్షరాస్యులుగా చేసే దిశగా సీసీలు, వీఓఏలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఏ మునిరాజ, ఎంఈఓ కృష్ణయ్య, వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, డివిజన్ సోషల్ ఆఫీసర్ ప్రసాద్, సూపర్‌వైజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు తొలి టీకా



రాపూరులో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



చిల్లకూరు: గర్భవతులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది పుచ్చలపల్లెలో..

రాపూరు: తల్లిపాలే బిడ్డకు తొలి టీకా వంటిదని, బిడ్డ జన్మించిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, దీని వల్ల పోషకాలు పుష్కలంగా అందడమే కాకుండా శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ సునందన అన్నారు. రాపూరులో గురువారం తల్లిపాల వారోత్సవాల ముగింపు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పిల్లలకు డబ్బాపాలు పట్టించరాదని హితవు పలికారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాధిక, సౌజన్య, అంగనవాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భవతులు పాల్గొన్నారు.

వేణుంబాకంలో..

దొరవారిసత్రం: మండలంలోని వేణుంబాకం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పిల్లల తల్లులు, గర్భవతులకు పౌష్టికాహారం, తల్లిపాల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

కోట: మండలంలోని పుచ్చలపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ క్రిష్ణమ్మ మాట్లాడారు. తల్లిపాల విశిష్టతను ఆమె వివరించారు. అంగన్‌వాడీ వర్కర్లు జె.అనిత, ప్రసన్న పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

చిల్లకూరు: మండలంలో ఏరూరు పంచాయతీలోని అల్లీపురం, గొల్లపాళెం, ఏరూరు, దళితవాడల అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి అల్లీపురంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతం చేసి ఆశీర్వదించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విజయకుమారి, జయమ్మ, రత్నమ్మ, వసంత, ఆశా కార్యకర్తలు స్వర్ణలత, సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా..?

నాయుడుపేటటౌన్: నాయుడుపేట, చిట్టమూరు తదితర మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లను ధ్వంసం చేసి రాగివైరు చోరీ చేస్తున్న ఓ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. వీరు చిట్టమూరు మండల వాసులని, ఒక్క చిట్టమూరు మండలంలోనే ఆరూరు, ఎల్లురు, గొల్లలనట్టు తదితర ప్రాంతాల్లో ఈ ముఠా ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడినట్లు ప్రాథమికంగా తేలినట్లు తెలుస్తోంది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక నిఘా పెట్టి ఈ ముఠాను పట్టుకున్నట్టు సమాచారం. పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

అక్షరాస్యతపై అవగాహన

చిల్లకూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పొదుపు మహిళా సంఘాల అధ్యక్షులు, సభ్యులకు అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెలుగు ఏపీఎం రత్నయ్య మాట్లాడారు. సమావేశంలో ఉపాధి ఏపీఓ గిరి, యూనియన్ బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

నేతలపై దాడి హేయం

చిట్టమూరు: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ నేత రామలింగారెడ్డిపై టీడీపీ గూండాలు దాడులకు తెగబడ్డారని వైఎస్సార్ సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.ఎస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇది హేయమైన చర్య అని, దాడులు చేస్తున్నా పోలీసులు కనీస భద్రత కూడా కల్పించకపోవడం దారుణమన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలి

గూడూరు రూరల్: ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే రద్దు చేయాలని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ డిమాండ్ చేశారు. గూడూరులోని అంబేడ్కర్‌నగర్, హైస్కూల్ రోడ్డు, బనిగిసాహెబ్‌పేట ప్రాంతాల్లో గురువారం స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డును మూడు ముక్కలుగా చేసి ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం పేరిట విభజించారన్నారు. ప్రస్తుతం మరలా విద్యుత్ సంస్థలను మొత్తం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నారని విమర్శించారు. సీపీఎం నాయకులు రామిరెడ్డి, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, పామంజి మణి, మధు, చంద్రయ్య, సుబ్బయ్య, సిరాజ్, సీపీఐ నాయకులు శశికుమార్, సీవీఆర్ కుమార్ పాల్గొన్నారు.

నూతన వరి వంగడాలపై అవగాహన

కోట: మండలంలోని గూడలి, తిన్నెలపూడిలో గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఏటీఎంఏ), నెల్లూరు ఆధ్వర్యంలో నూతన వరి వంగడాలపై రైతులకు ఆత్మ పీడీ మురళి అవగాహన కల్పించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు వివరించారు. ఏఓ సుచేంద్రప్రసాద్, ఏఈఓ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదవుల కోసం తెలుగు తమ్ముళ్ల పోట్లాట..!

- రూరల్ అధ్యక్ష పదవికి ఏడుగురు, పట్టణ పార్టీకి ముగ్గురు పోటీ

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీకి సంస్థాగత ఎన్నికల నిర్వహణ విషయంలో తెలుగు తమ్ముళ్లు వర్గాలుగా విడిపోయి కొట్లాడుకుంటూ మరీ పోటీ పడుతున్నారు! ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ పరిశీలకులు జడ్.శివప్రసాద్‌ల సమక్షంలో గురువారం సంస్థాగత ఎన్నికలను నిర్వహించారు. ఓజిలి మండల అధ్యక్ష పదవికి ఎంపిక విషయంలో బాహాబాహీకి దిగారు. సూళ్లూరుపేటలో కూడా వేనాటి వారి టీడీపీ కార్యాలయంలో కాకుండా రైల్వేగేట్ సమీపంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్నికలను నిర్వహించారు. తొలుత తడ, దొరవారిసత్రం మండల నాయకులతో వేర్వేరుగా సమావేశమై వారి నుంచి మండల పార్టీ అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా ప్రతిపాదించి పేర్లు తీసుకున్నారు. అయితే సూళ్లూరుపేట విషయానికొచ్చేసరికి తెలుగుతమ్ముళ్లు బల ప్రదర్శనకు దిగి వర్గపోరుకు తెరలేపారు. సూళ్లూరుపేట పట్టణ పార్టీ అధ్యక్ష పదవికి ఆకుతోట రమేష్, పచ్చవ మాధవ నాయుడు, ఏ.జీ కిషోర్ పోటీపడి పేర్లు ఇచ్చారు. రూరల్ అధ్యక్ష పదవికి పోటీ తీవ్రమై ఏడుగురు పేర్లు ఇవ్వడంతో ఎమ్మెల్యే, పరిశీలకులకు తలనొప్పిగా మారింది. అధిష్టానం ఎవరినైతే ఎంపిక చేస్తారో వారినే నిర్ణయిస్తామని వారు తెలియజేశారు.

ఓజిలిలో ఎమ్మెల్యే ముందే డిష్యుం..డిష్యుం..!

ఓజిలి మండల పార్టీ అధ్యక్ష పదవి కోసం తెలుగు తమ్ముళ్లు రెండు వర్గాలుగా విడిపోయి ఎమ్మెల్యే, పరిశీలకుల సమక్షంలోనే వేదికపైనే బాహాబాహీకి దిగారు. ఓజిలికి చెందిన శివ, పెద్ద పరియ గ్రామానికి చెందిన సుధాకర్ అధ్యక్ష పదవిని తమకే ఇవ్వాలని పట్టుబట్టారు.దీంతో ఇరు వర్గాలు పరస్పరం దూషణకు దిగి పిడిగుద్దులతో యుద్ధ వాతావరణాన్ని తలపించారు. ఈ రణరంగ వాతావరణం నడుమ ఎమ్మెల్యేను వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఆమెను అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఈ బాహాబాహీ చర్చనీయాంశమైంది.

స్టార్టప్, ఇన్నోవేషన్‌తో భవిష్యత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శకుంతల కాసరగడ్డ

గూడూరు రూరల్: స్టార్టప్, ఇన్నోవేషన్‌తో విద్యార్థులకు ఎంతో భవిష్యత్ ఉంటుందని ఫౌండర్స్ ల్యాబ్ వ్యవస్థాపక సీఈఓ శకుంతల కాసరగడ్డ (హైదరాబాద్) అన్నారు. గూడూరు సమీపంలోని ఆదిశంకర డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్, ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సహకారంతో స్టార్టప్ డయలాగ్- భవిష్యత్తును నిర్మించే సంభాషణలు అనే అంశంపై రెండ్రోజుల శిక్షణ గురువారం ముగిసింది. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, ఇన్నోవేషన్, స్టార్టప్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. శకుంతల కాసరగడ్డ విద్యార్థులతో ముఖాముఖి, నెట్ వర్కింగ్ సెషన్లు నిర్వహించారు.కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య, డాక్టర్ ఎం.రాజయ్య, డాక్టర్ కె.ధనుంజయ, డాక్టర్ టి.వేణుమాధవ్, ప్రొఫెసర్ ప్రణయ్‌కుమార్, యోగా నరసింహులు నాయుడు, ఏఓ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు



పొర్ల కట్ట నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న అక్రమార్కులు

బాలాయపల్లి (సైదాపురం): మండలంలోని నిండలి గ్రామ సమీపాన కై వల్యానది పొర్లకట్టకు ఉన్న ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని గురువారం వెంకటరెడ్డిపల్లె, నిండలి గ్రామ రైతులు బాలాయపల్లె రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ, ఇసుకను అక్రమార్కులు తోడేయడంతో దీంతో చిన్నపాటి వర్షం వచ్చినా పొలాలు వరద నీటి కోతకు గురై పంట నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలకు చెక్ పెట్టాలని పలు పర్యాయాలు రెవెన్యూ అధికారులకు నివేదించినా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

• కన్నీటి నివాళి



మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న నేతలు



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

డక్కిలి జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి గురువారం మృతిచెందారు. ఆమె మృత దేహాన్ని వెంకటగిరి పట్టణంలోని కాలేజీమిట్టలో ఉన్న స్వగృహంలో ప్రజల సందర్శన కోసం గురువారం ఉంచారు. శుక్రవారం స్వగ్రామం అయిన డక్కిలి మండలం, చాపలపల్లి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నియోజకవర్గ ప్రజలు, నేతలతో పాటు కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. – వెంకటగిరి రూరల్

హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం

గూడూరు రూరల్: గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో గురువారం డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి సహకారంతో హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రతినెలా 30 మంది బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ స్వాతి, సంస్థ సెక్రటరి జి.చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, డీఏంసీ సభ్యులు వెంకటేశ్వరరావు, కెఆర్ఎం, విశ్రాంత ఎస్‌ఐ ప్రభాకర్, యశ్వంత్ నాగరాజు, శ్యామ్, కుమార్‌నాయుడు పాల్గొన్నారు.

పనబాక రాజశేఖర్ మృతి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న పనబాక దంపతులు, నాయకులు

కోట: టీడీపీ నాయకుడు పనబాక కృష్ణయ్య అన్న కుమారుడు, తెలుగుగంగ ఏఈ పనబాక రాజశేఖర్ ఉత్తర క్రియలు, సంతాపసభ గురువారం కోటలో నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి, టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య దంపతులు పాల్గొని రాజశేఖర్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. పలువురు నాయకులు, పనబాక అభిమానులు రాజశేఖర్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలుగుగంగ ఏఈగా ఆయన ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. కార్యక్రమంలో నెలవల సుబ్రమణ్యం, చెంచల్‌బాబు యాదవ్, మనపాటి రవీంద్ర, చేవూరు దేవకుమార్‌రెడ్డి, యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, దువ్వూరు బాలచంద్రారెడ్డి, రమణారెడ్డి, ముని గిరీష్, కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో మొక్కల పెంపకం



నర్సరీని పరిశీలిస్తున్న నెల్లూరు రేంజర్ మాల్యాద్రి

సైదాపురం: నెల్లూరు రిజర్వ్ ఫారెస్ట్‌లో మొక్కల పెంపకానికి పూనుకున్నట్టు నెల్లూరు అటవీశాఖ రేంజర్ మాల్యాద్రి వెల్లడించారు. సైదాపురం సమీపంలోని సైదాపురం సెంట్రల్ నర్సరీని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ నర్సరీలో 2లక్షల మొక్కలను పెంచుతున్నామని, అక్రమ మైనింగ్ నిరోధించేందుకు ప్రత్యేక కందకపు పనులకు పూనుకున్నట్టు ఆయన చెప్పారు. సెక్షన్ అధికారి శ్రీనివాసులు, బీఓ రవిశేఖర్ పాల్గొన్నారు.

అభినందన



పూజితను అభినందిస్తున్న గూడూరు నాయకులు

చిల్లకూరు: వైఎస్సార్‌సీపీ జోన్-4 వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన కాకాణి పూజితను గురువారం నెల్లూరులోని ఆమె స్వగృహంలో గూడూరు మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కార్యక్రమంలో గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య, నెల్లూరు జిల్లాల యూత్ ప్రెసిడెంట్ ఊటుకూరు నాగర్జున, రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ కొండూరు సునీల్‌రెడ్డి, మనుబోలు క్రిష్ణయ్య, సన్నిబోయిన మహేంద్ర, ఎల్లంరాజు ప్రభాకర్‌రాజు, కె.అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

పెళ్లకూరు: స్థానిక చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్‌లో బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ పొందిన యువతులకు గురువారం తహసీల్దార్ హరికృష్ణ చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ సీఈఓ సీతారామనాయుడు, ఏఓ కృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు		8.8.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	107
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	222
లేయర్ చికెన్	:	190

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కలువాయి(సైదాపురం): మండలంలోని కుల్లూరు గ్రామ సర్వే నెంబర్ 598లో 20 ఎకరాలు కూటమి నాయకులు ఆక్రమణకు యత్నించడంపై సాక్షిలో ప్రచురితమైన వరుస కథనాలపై ఎట్టకేలకు రెవెన్యూ, అటవీ అధికారులు స్పందించారు. 598 సర్వే నంబర్ భూమి రిజర్వ్ ఫారెస్టు అని తేల్చారు. ఈ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జనార్దన్, కుల్లూరు-2 సచివాలయ వీఆర్వో రామయ్య తెలిపారు. ఆ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.